క్లుప్తంగా

ఘనంగా వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు



స్వామి వారిని దర్శించుకుంటున్న జగ్గిరెడ్డి, శ్రీకాంత్ తదితరులు

అమలాపురం రూరల్: కిమ్స్ వైద్య కళాశాల ప్రాంగణంలో వేంచేసియున్న శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి దశమ వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. మూడవ రోజు సుదర్శన హోమం, పూర్ణాహుతి, చక్రస్నానం వంటి పూజ కార్యక్రమాలను ఎండీ రవికిరణ్‌వర్మ శేష పవిత్ర దంపతులు వైభవంగా జరిపించారు. అనంతరం స్వామి వారి గ్రామోత్సవం కన్నుల పండువగా సాగింది. ఈ బ్రహ్మోత్సవాలను జయప్రదం చేసిన భక్తులకు, కిమ్స్ సిబ్బందికి సంస్థ చైర్మన్ చైతన్య రాజు ధన్యవాదాలు తెలిపారు. వేంకటేశ్వర స్వామి వారి దశమ వార్షిక బ్రహ్మోత్సవాల్లో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి అమలాపురం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ పినిపే శ్రీకాంత్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాస్, జెడ్పీటీసీ పందిరి శ్రీహరి రామ్‌గోపాల్ తదితరులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు.

భగీరథ మహర్షి కఠోర దీక్ష ఆదర్శనీయం



భగీరథ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఏవో కాశీ విశ్వేశ్వరరావు

అమలాపురం రూరల్: భగీరథ మహర్షి కఠోర తపస్సుతో గంగను దివి నుంచి భువికి తీసుకుని వచ్చారని కలెక్టరేట్ పరిపాలన అధికారి కడలి కాశీ విశ్వేశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం వైశాఖ శుద్ధ సప్తమిని సందర్భంగా సగరుల కుల గురువైన భగీరథ మహర్షి జయంతిని ప్రభుత్వం పరంగా కలెక్టరేట్‌లో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా భగీరథ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఏవో మాట్లాడుతూ సగరుల కులదైవం భగీరథ మహర్షి కఠోరమైన దీక్షతో అనుకున్నది సాధించి ఆదర్శంగా నిలిచారని అన్నారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి రమేష్ మాట్లాడుతూ భగీరథ మహర్షిని స్మరించుకోవడం మనందరి కర్తవ్యం అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

అమలాపురం రూరల్: ఈదరపల్లి బ్రిడ్జి వద్ద రోడ్డు వెడల్పు పనుల్లో భాగంగా సోమవారం విద్యుత్ స్తంభాలు మార్పు కారణంగా అమలాపురం మండలం ఈదరపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలతో పాటు ఈ సబ్ స్టేషన్‌కు అనుసంధానమైన అమలాపురంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఈఈ రాంబాబు తెలిపారు. సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని విద్యుత్ శాఖ డీఈఈ రాంబాబు తెలిపారు

ప్రకృతి వ్యవసాయంలో ఎకరాకు 24 బస్తాల దిగుబడి

తాళ్లరేవు: గోవు ఆధారిత ప్రకృతి వ్యవసాయం పద్ధతుల ద్వారా పండించిన పంట 24 బస్తాల దిగుబడి వచ్చింది. ఆదివారం పి.మల్లవరం లోని కృషి అమృత్ గోవు ఆధారిత ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో వ్యవసాయశాఖ అధికారులు పంటకోత ప్రయోగం చేసారు. పి.మల్లవరం విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ అజయ్ 25 మీటర్ల విస్తీర్ణంలో గల పంటను కోసి ప్రయోగం చేసారన్నారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులు ధూళిపూడి వెంకటరమణ, దడాల సత్తికొండ మాట్లాడుతూ ఆర్‌యస్‌ఆర్ 15048 రకం వరిని గోవు ఆధారిత వ్యవసాయం ద్వారా సాగు చేసామన్నారు. ఎటువంటి రసాయనాలు వాడకుండా చేసిన సాగు ద్వారా 24 బస్తాల దిగుబడి రావడం ఆనందంగా ఉందన్నారు. ప్రతి రైతు వచ్చే తొలకరిలో తమ ఇంటి ఆహార అవసరాలకు సరిపడే విధంగా దేశవాళీ విత్తనాలు సాగు చేసి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంటీ ధనలక్ష్మి, సతీష్, వెంకటలక్ష్మి, నేహ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఐ.పోలవరం: కేశనకుర్రులో వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు (బుచ్చిబాబు) ఆదివారం శంకుస్థాపన చేశారు. స్థానిక పేరాయిచెరువు వద్ద రూ.23.50 లక్షల వ్యయంతో 20 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన మంచినీటి ట్యాంకును, అరుంధతిపాలెంలో రూ.24.2 లక్షలతో 20 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన మంచి నీటి ట్యాంకు, పైప్‌లైన్ విస్తరణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ముమ్మిడివరంలో తడిసిన వరి పనలతో రైతు



ఎంట్రుకోనలో ధాన్యం రాశుల కిందకు నీరు చేరకుండా దారులు ఏర్పాటు చేసుకుంటున్న రైతు



వర్షానికి అమలాపురం సావరం రోడ్డులో జలమయమైన ఓ వీధి



విలసవిల్లిలో వర్షం బారి నుంచి ధాన్యాన్ని రక్షించుకునే పనిలో రైతు నిమగ్నం

అకాల వర్షాలు.. రైతుల అవస్థ

- వ్యవసాయ పనులకు అంతరాయం
- వర్షాలకు తడిసిన వరి పనులు
- ఆందోళనలో అన్నదాతలు
- స్తంభించిన జన జీవనం



ముమ్మిడివరం మండలం గాడిలంకలో ధాన్యం రాశులపై వర్షపు నీటిని తొలగిస్తున్న రైతు

అల్లవరం: ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికి అందేలోపే అకాల వర్షాల వల్ల తడిసింది. ఆదివారం ఉదయం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురవడంతో మండలం వ్యాప్తంగా పంటలు దెబ్బతిన్నాయి. పండిన పంటను ఒబ్బిడి చేసుకునేలోపే అకాల వర్షంతో వ్యవసాయ పనులకు అంతరాయం ఏర్పడింది. భారీ వర్షంతో వరి కోతలు నిలిచిపోయాయి. ధాన్యం రాశులు కళ్లాల్లోనే దర్శనమిస్తున్నాయి. సుమారు 40 ఎకరాల్లో వరి పనలు తడిశాయి. మండలంలో వ్యాప్తంగా 1,900 ఎకరాల్లో వరి కోతలు పూర్తి కాగా, 2,100 ఎకరాల్లో వరి కోతకు సిద్ధంగా ఉంది. అయితే మూడు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించడంతో రైతులు అప్రమత్తంగా వ్యవహరించి నష్ట నివారణ చర్యలు తీసుకున్నారు. కళ్లాల్లోని ధాన్యం రాశులు వర్షానికి తడిసిపోకుండా బరకాలు వేసుకుని కాపాడుకునే ప్రయత్నం చేశారు. కళ్లాల్లో ఉన్న ధాన్యం రాశుల కింద నీరు చేరకుండా నష్ట నివారణ చర్యలు చేపట్టారు. రైతులు ఓపెన్ మార్కెట్‌లో వారి ఇష్టానుసారంగా ధాన్యం అమ్ముకోవచ్చని వ్యవసాయాధికారి ఎస్‌వీవీ సత్యనారాయణ తెలిపారు. ఇప్పటి వరకు 1,900 మెట్రిక్ టన్నులు ధాన్యాన్ని రైతుల నుంచి సేకరించామని ఆయన తెలిపారు.

అమలాపురంలో దంచి కొట్టిన వాన

అమలాపురం టౌన్: అకాల వర్షం కారణంగా ఆదివారం అమలాపురంలో జన జీవనం స్తంభించింది. ఉదయం 9 నుంచి 11 గంటల వరకూ వర్షం దంచి కొట్టింది. స్థానిక ముస్లిం వీధి, శ్రీదేవి మార్కెట్ రోడ్డు, కుంకాల సందు, సావరం, ఆర్టీసీ బస్ స్టేషన్ తదతర చోట్ల లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. దీంతో ఉదయం షాపులు తెరుచుకోలేదు. అమలాపురం మార్కెట్ ఆ రెండు గంటల పాటు వెలవెలబోయింది. ప్రజలు ఇళ్లకే పరిమితమై మధ్యాహ్నం 12 గంటల తర్వాత వర్షం తెరిపిచ్చిన తర్వాత బయటకు వచ్చి తమ దైనందన కార్యక్రమాల్లో నిమగ్నమయ్యారు. రోడ్లు వర్షం నీటితో నిండిపోయాయి. కొద్దిసేపటికి డ్రెయిన్లు ముంపు నీటిని లాగడంతో రోడ్లు ముంపు నుంచి విముక్తి అయ్యాయి.

తడిసి ముద్దయిన ధాన్యం రాశులు

ముమ్మిడివరం: అకాల వర్షం అన్నదాతను నిండా ముంచింది. చేతికొచ్చిన పంటను నీళ్ల పాలుజేసి రైతుల కంట కన్నీళ్లు మిగిల్చింది. మాసూలు చేసి విక్రయానికి సిద్ధం చేసిన ధాన్యం రాశులు తడిసి ముద్దయ్యాయి. ప్రస్తుతం మాసూలు చేసిన ధాన్యాన్ని ఎండ బెట్టిన రైతులు రాశులు, కుప్పల మీద, కొంతమంది గోనె సంచుల్లో కల్లాల్లోనే ఉంచారు. కొంతమంది యంత్రాలతో వరి కోతలు పూర్తిచేసి ధాన్యాన్ని చేలల్లోనే రాశులుగా పోశారు. ఆదివారం వాతావరణం అకస్మాత్తుగా మారి ఈదురుగాలులతో వర్షం కురవడంతో రైతుల చేతికొచ్చిన పంటను కాపాడుకునే అవకాశం లేకుండా పోయింది. ధాన్యం రాశులు తడిసి ముద్దయ్యాయి. ఒకటి రెండు రోజుల్లో ధాన్యం విక్రయించాలని ఆశించిన అన్నదాతలకు నిరాశే మిగిలింది. ముమ్మిడివరం సబ్ డివిజన్ పరిధిలో 21,023 ఎకరాలు వరి పంటను సాగు చేశారు. సుమారు 30 శాతం పంటను మాసూళ్లు చేసి రైతులు ధాన్యాన్ని కళ్లాల్లోనే ఉంచారు. కొంతమంది కళ్లాల్లో కుప్పలుగా వేసి ఉంచారు. తడిసిన ధాన్యం రంగు మారే ప్రమాద ముందని రైతులు దిగులు చెందుతున్నారు. పంటను ఒబ్బిడి చేసుకునేందుకు రైతులు నానా తంటాలు పడుతున్నారు.

విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం

అకాలవర్షంతో పాటు ఈదురు గాలులకు అక్కడక్కడా చెట్ల కొమ్మలు, కొబ్బరి చెట్లు విరిగి పడ్డాయి. విద్యుత్ తీగలు తెగి పడ్డాయి.దీంతో ఆదివారం సాయంత్రం వరకు విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

యానాంలో..

యానాం: నియోజకవర్గంలో ఆదివారం ఉదయం ఈదురుగాలులతో కూడిన భారీవర్షం కురవడంతో విద్యుత్ లైన్లు పలుచోట్ల దెబ్బతిన్నాయి.దీంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. విద్యుత్ సిబ్బంది మరమ్మతులు పూర్తి చేసి సాయంత్రం 6.30 నుంచి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

రైతులను బెంబేలెత్తించిన వర్షం

ఉప్పలగుప్తం: మండలం పరిధిలో ఆదివారం కురిసిన అకాల వర్షానికి రబీ సాగు చేసిన రైతులు బెంబేలెత్తారు. ఉదయం కురిసిన వర్షానికి వరి కోతలు కోసిన రైతులు పొలాల వైపు ఉరుకులు పరుగులు తీశారు. కళ్లాల్లో ఉన్న ధాన్యాన్ని వర్షం బారి నుంచి కాపాడుకోవడానికి నానా అవస్థలు పడ్డారు. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మండల వ్యాప్తంగా 6,140 ఎకరాల్లో వరిసాగు చేయగా 4,070 ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయని, 270 ఎకరాలు మాత్రమే కోతలు పూర్తి కావాల్సి ఉందని వ్యవసాయ అధికారి జి.కుమార్‌బాబు తెలిపారు. పనలపై 38 ఎకరాల వరి సాగు వర్షం బారిన పడిందని, తడిచిన పనలపై 5 శాతం ఉప్పు ద్రావణాన్ని చల్లుకుని వరి పనులను ఆరబెట్టుకోవాలని ఆయన సూచించారు.

కుండపోత వర్షం.. రైతుల ఆందోళన

అమలాపురం రూరల్: కుండపోత వర్షం కారణంగా చేతికి అంది వచ్చిన వరి పంట కళ్లముందే తడిసి ముద్దవుతుంటే అన్నదాతల కళ్లల్లో కన్నీళ్లు కనిపించాయి. ధాన్యంలో తేమ శాతం 17 లోపు ఉండాలంటూ ప్రభుత్వం మెలిక పెట్టడంతో ఎండకు ఆరబెట్టిన వరి ధాన్యం ఒక్కసారిగా కురిసిన వర్షం వల్ల తడిసి ముద్దయింది. కళ్లాలోని ధాన్యం తడిసిపోతుంటే మరో వైపు వరి చేలల్లోని పనలు నీట మునిగాయి. అమలాపురం రూరల్ మండలంలోని నడిపూడి, రోళ్లపాలెం, సమనస, పేరూరు, వేమవరం నల్లమిల్లి, జనుపల్లి తదితర గ్రామాల్లో భారీ వర్షం కారణంగా వరి పంటకు నష్టం చేకూరింది. పంట ఒబ్బిడి చేసుకునేందుకు కూలీలు కొరత కారణంగా అవస్థలు పడుతున్న రైతులను అకాల వర్షం నిండా ముంచింది. తేమ శాతాన్ని ప్రభుత్వం పరిగణలోకి తీసుకోకుండా గిట్టుబాటు ధరకు ధాన్యం కొనుగోలు చేయాలంటూ రైతులు కోరుతున్నారు. ఇదిలా ఉంటే భారీ వర్షం, గాలుల కారణంగా విద్యుత్ అంతరాయం ఏర్పడింది. చెట్లు విరిగి పడడంతో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ముమ్మిడివరం జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో కలసిన పూర్వ విద్యార్థులు

ముమ్మిడివరం: వారంతా ఎక్కడెక్కడో స్థిరపడ్డారు. ఉద్యోగ, వ్యాపార రీత్యా దూర ప్రాంతాల్లో ఉన్న వారంతా ఒక్క చోట చేరి సందడి చేశారు. ముమ్మిడివరం జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో 2003–04 పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులంతా కలుసుకుని ఆదివారం సందడి చేశారు. ఒకరినొకరు బాల్యస్నేహితుల యోగ క్షేమాలు అడిగి తెలుసుకుని సరదా కబుర్లతో ఆనంద డోలికల్లో మునిగి తేలారు. అలనాటి మధుర స్మృతులను నెమరు వేసుకుంటూ ఆటపాటలతో అనందంగా గడిపారు. పాఠశాల హెచ్ఎం సీహెచ్ పరిమళ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో వారికి విద్యాబుద్ధులు చెప్పిన గురువులు ఆర్. మమత, ఎంవీ మహాలక్ష్మి, ఎస్.ఇందిర, బి.మంగాదేవి, డి.నాగలింగేశ్వరరావు, ఏ.ఉదయ శేషారత్నం, కే.బేబి పద్మజ, జి.రత్నకుమారి, పి.వరలక్ష్మి, పి.గోపాలకృష్ణంరాజు, అటెండర్స్ ఎస్.గోవిందరాజు, ప్రసాద్‌ను ఘనంగా సత్కరించారు. పూర్వవిద్యార్థినులు ఎస్.జ్యోతి, ఎస్.లోవతల్లి, జి.భ్రమరాంబ, జ్యోత్స్న, పి.శిరీషా, కే.నాగరత్నం పాల్గొన్నారు.

ప్రశాంతంగా నీట్ పరీక్ష



యానాంలో నీట్ పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు

యానాం: ఎంబీబీఎస్ వంటి మెడికల్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే నీట్ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. స్థానిక జవహర్ నవోదయ విద్యాలయలో నిర్వహించిన పరీక్షకు 134 మందికి 133 మంది విద్యార్థులు హాజరయ్యారని ప్రిన్సిపాల్, సెంటర్ సూపరిండెంట్ ఎస్ఎస్‌వీ కీర్తి తెలిపారు. అభ్యర్థుల కోసం 6 పరీక్ష గదులను ఏర్పాటు చేశామని, 12 మంది ఇన్విజిలేటర్లను నియమించినట్లు తెలిపారు. ఆర్ఏఓ మునిస్వామి, సీఐ అడలసన్, ఎస్సై పునీత్ రాజ్ తదితరులు పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు.

ఆలస్యంగా వచ్చిన విద్యార్థి

నీట్ పరీక్ష కేంద్రానికి సకాలంలో చేరుకోకపోవడంతో ఒక అభ్యర్థినిని అధికారులు పరీక్షా కేంద్రంలోకి అనుమతించలేదు. మధ్యాహ్నం 1.30 గంటలకు పరీక్షా కేంద్రం గేట్లు మూసివేసారు. ఆ విద్యార్థి 1.45 గంటలకు రావడంతో లోపలికి అనుమతిని నిరాకరించడంతో అతను వెనుదిరిగాడు. చివరి నిమిషంలో పరీక్షా కేంద్రం మారడంతో కన్నీటిపర్యంతమవుతున్న నీట్ విద్యార్థి పరిస్థితిని గమనించి ఆమెను తన ద్విచక్రవాహనంపై ఎక్కించుకుని సరైన పరీక్షా కేంద్రానికి తీసుకువెళ్లిన పుదుచ్చేరి స్పెషల్ బ్రాంచ్ ఏఎస్సై అర్ముగంను పలువురు ప్రశంసించారు. పుదుచ్చేరి లాస్‌పేటలో పరీక్షా కేంద్రానికి ఒక ఎన్ఆర్ఐ విద్యార్థిని తన తల్లిదండ్రులతో కలిసి వచ్చింది. అయితే ఆమె పరీక్షా కేంద్రం కాకపోవడంతో కిలోమీటర్ దూరంలో గరల్స్ ఇంజనీరింగ్ కాలేజీకి వెళ్లమని అధికారులు సూచించారు. ఆమె విదేశీ విద్యార్థి కావడంతో సెంటర్ తెలియక కన్నీరుమున్నీరుగా విలపించింది. ఈ నేపథ్యంలో బందోబస్తులో ఉన్న స్పెషల్ యూనిట్ ఏఎస్సై అర్ముగం తన ద్విచక్రవాహనంలో ఆమెను ఆఖరి నిమిషంలో పరీక్షా కేంద్రం లోపలికి తీసుకువెళ్లారు.

విజ్ఞానదాయకంగా వేసవి శిబిరాలు

- ఉచిత శిక్షణ శిబిరాల ద్వారా వేసవి సెలవులు సద్వినియోగం
- క్రీడలు, నైతిక విలువలు నేర్పేందుకు ప్రాధాన్యం
- వేసవి విజ్ఞాన శిబిరాలకు మొగ్గు చూపుతున్న విద్యార్థులు



బాస్కెట్ బాల్ క్రీడలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు



విద్యార్థులకు నైతిక విలువలపై బోధిస్తున్న సత్య సాయి బాల వికాస్ ప్రతినిధి

అమలాపురం టౌన్: పరీక్షలు పూర్తవగానే సెలవులు ఇస్తారు. వేసవి సెలవులు పేరుతో ఏదైనా వినోద యాత్రకో, బంధువుల ఇంటికో వెళ్లే విద్యార్థులు ఇప్పుడు వేసవి ఉచిత శిక్షణ శిబిరాల బాట పడుతున్నారు. యాత్రల కంటే ఉచిత శిక్షణ శిబిరాలకు వెళితే విజ్ఞానంతో పాటు, పుస్తక పఠనం, నైతిక విలువలపై కథలు చదవడం, వినడం ద్వారా వ్యక్తిత్వ వికాసం సాకారమవుతుందని విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. దీంతో వేసవి ఉచిత శిక్షణ శిబిరాలకు విద్యార్థులు హాజరు ఏటా పెరుగుతోంది. వేసవి సెలవులను విజ్ఞానదాయకంగా సద్వినియోగం చేసుకునేందుకు వారు మొగ్గు చూపుతున్నారు. జిల్లా కేంద్రం అమలాపురంలో పలు వేసవి ఉచిత శిక్షణ కేంద్రాలు వేసవి సెలవులు అరంభం కాగానే మొదలయ్యాయి. పట్టణంలోని ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయం వేసవి వినోదం పేరుతో కథలు వినిపించడం, చెప్పడం, పుస్తక పఠనంపై ఆసక్తి పెంచడం, చిత్ర లేఖనం తదితర అంశాలపై వేసవి ఉచిత శిక్షణ దాదాపు 40 రోజుల పాటు ఇచ్చేందుకు శిక్షణ తరగతులు మొదలు పెట్టింది.

క్రీడల్లో నైపుణ్యం కోసం

అమలాపురం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా స్థలంలో జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్, కుడుపూడి గోపాలకృష్ణ గోఖలే మెమోరియల్, కుడుపూడి ప్రభాకరరావు మెమోరియల్ సంయుక్త ఆధ్వర్యంలో వేసవి ఉచిత బాస్కెట్ బాల్ క్రీడా శిక్షణా శిబిరంలో అయిదు రోజులు కిందట మొదలైంది. రోజు సాయంత్రం పాఠశాలల స్థాయి విద్యార్థులు బాస్కెట్ బాల్ క్రీడలో తర్ఫీదు పొందుతున్నారు. దాదాపు 100 మంది విద్యార్థులు ఈ క్రీడల్లో శిక్షణ పొందుతున్నారు. ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు పర్యవేక్షణలో కోచ్ ఆకుల ఉమా మహేశ్వరరావు, పలువురి పీఈటీల ఆధ్వర్యంలో ఈ శిక్షణ శిబిరం నడుస్తోంది. స్థానిక ఎస్‌కేబీఆర్ కళాశాలలో సపక్ తక్రా క్రీడపై శిక్షణా శిబిరం మొదలైంది. ఆ క్రీడ జిల్లా అధ్యక్షుడు జవ్వాది తాతబాబు, కోచ్ యాండ్ర గౌతమ్ పర్యవేక్షణలో నడుస్తున్న ఈ శిబిరం నెల రోజులు పాటు కొనసాగి విద్యార్థులకు సపక్ తక్రా క్రీడపై శిక్షణ ఇవ్వనున్నారు. అటు బాస్కెట్‌బాల్, ఇటు సపక్ తక్రా క్రీడల శిక్షణ శిబిరాలు జిల్లా క్రీడా సంస్థ సహకారంతో కొనసాగుతున్నాయి.

నైతిక విలువలు నేర్పే దిశగా

అమలాపురం డివిజన్ సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో స్థానిక సత్య సాయి కల్యాణ మండపంలో విద్యార్థులకు జిల్లా సత్య సాయి బాల వికాస్ ఆధ్వర్యంలో వేసవి ఉచిత శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి. ఎనిమిదేళ్ల నుంచి పదహారేళ్లలోపు విద్యార్థులకు పలు సంప్రదాయ కళలు, నైతిక విలువలు, కుటుంబ బంధాల ప్రాధ్యాన్యత, నీతి కథలు, ఇతిహాస పురాణాలు, మహనీయులు జీవిత చరిత్రలు, రామాయాణం, భాగవతం శ్లోకాలు తదితర అంశాలపై ఆ రంగాల నిపుణులతో పిల్లలకు శిక్షణ ఇప్పిస్తున్నారు. డివిజన్ సత్య సాయి సేవా సంస్థల కో ఆర్డినేటర్ డాక్టర్ జి.ప్రభాకర్, జిల్లా సత్య సాయి బాల వికాస్ గురువు శిష్టా గుణ రంజన్ పర్యవేక్షణలో ఈ వేసవి శిక్షణా తరగతులు కొనసాగుతున్నాయి.


క్రీడా స్ఫూర్తి అలవడుతుంది



అమలాపురం జెడ్పీ పాఠశాల విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని అలవర్చేందుకు అమలాపురంలో ఏటా వేసవిలో బాస్కెట్‌బాల్ క్రీడలో వారికి ఉచిత శిక్షణ ఇస్తున్నాం. ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్, కుడుపూడి గోపాలకృష్ణ గోఖలే, కుడుపూడి ప్రభాకరరావు మెమోరియల్ సంస్థల కృషితో ఏటా ఈ వేసవి శిక్షణ శిబిరం ద్వారా వంద మంది విద్యార్థులకు బాస్కెట్‌బాల్ క్రీడలో శిక్షణనిస్తున్నాం.

– ఆకుల ఉమా మహేశ్వరరావు, బాస్కెట్‌బాల్ కోచ్

నైతిక విలువలు పెంపొందించేందుకే



చిన్నారుల్లో నైతిక విలువలు పెంచేందుకు సత్యసాయి సేవా సంస్థలు, సత్య సాయి బాల వికాస్ ఏటా వేసవి సెలవుల్లో కృషి చేస్తున్నాం. చిన్నారుల్లో నైతిన విలువల పెంపొందించడమే కాకుండా వారిలో కుటుంబ బంధాల విలువ ప్రాధాన్యతపై శిక్షణ ఇస్తున్నాం. వేసవి శిబిరం ద్వారా విద్యార్థుల్లో నైతికత, కుటంబ బంధాల విలువ, నీతి నిజాయతీ వంటి అంశాలపై శిక్షణ ఇస్తున్నాం.

– శిష్టా గుణరంజన్, జిల్లా సత్యసాయి బాల వికాస్ గురువు

క్రీడల్లో ఉచిత శిక్షణ



అరుదైన సపక్ తక్రా క్రీడ పట్ల విద్యార్థుల్లో ఆసక్తి పెంచేందుకు ఈ వేసవి ఉచిత శిక్షణ ద్వారా కృషి చేస్తున్నాం. ఈ క్రీడ పట్ల విద్యార్థులు మరింత ఆకర్షితులై ప్రావీణ్యం పొందాలన్నది మా లక్ష్యం. అందుకే ఈ వేసవి సెలవులను ఉచిత శిక్షణ ద్వారా విద్యార్థులను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నాం. కోచ్ యాండ్ర గౌతమ్ పర్యవేక్షణలో నెల రోజుల పాటు విద్యార్థులకు సపక్ తక్రాలో శిక్షణ అందిస్తున్నాం.

– జవ్వాది తాతబాబు, అధ్యక్షుడు, జిల్లా సపక్ తక్రా అసోసియేషన్

బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడికి సన్మానం



యాలంగి సత్యనారాయణను సన్మానిస్తున్న సర్పంచ్ వెంకటరావు

అల్లవరం: ఇటీవల బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా నియమితులైన తుమ్మలపల్లికి చెందిన యాలంగి సత్యనారాయణను దేవగుప్తం సర్పంచ్ సాధనాల వెంకటరావు స్వగృహంలో ఆదివారం ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. పేదలకు ఉచిత న్యాయ సలహాలు అందిస్తూ న్యాయవాదిగా సత్యనారాయణ గుర్తింపు తెచ్చుకున్నారని సర్పంచ్ వెంకటరావు అన్నారు. ఈ కార్యక్రమంలో కాశీ బాలయోగి, సాధనాల శ్రీను, శెట్టిబత్తుల తులసీరావు పాల్గొన్నారు.

ఏపీయూడబ్ల్యూజే ప్రతినిధులకు ఘన సత్కారం



ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, ప్రదీప్‌ను సత్కరిస్తున్న జగ్గిరెడ్డి, శ్రీకాంత్, శ్రీనివాసరావు

అమలాపురం టౌన్: ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఏపీయూడబ్ల్యూజే) జిల్లా ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలకు
అధ్యక్షుడిగా ఎన్నికైన అమలాపురానికి చెందిన ఎమ్మెస్వీ ప్రసాద్, కె.ప్రదీప్‌కుమార్‌ను వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి స్థానిక ప్రెస్ క్లబ్ భవనంలో ఆదివారం సత్కరించి అభినందించారు. జగ్గిరెడ్డితో పాటు ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్, అమలాపురం, పి.గన్నవరం నియోజకర్గాల పార్టీ కో ఆర్డినేటర్లు డాక్టర్ పినిపే శ్రీకాంత్, గన్నవరపు శ్రీనివాసరావు తదితరులు ప్రసాద్, ప్రదీప్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు కుడుపూడి భరత్ భూషణ్, వంటెద్దు వెంకన్నాయుడు, సూదా గణపతి, చింతా రవి కిరణ్, కల్వకొలను ఉమ, రాజీ రమేష్, మద్దింశెట్టి ప్రసాద్, దొంగ చిన్నా ప్రసాద్, ప్రదీప్‌ను అభినందించారు.

కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల నిరసన

అమలాపురం రూరల్: కోనసీమ జిల్లా గ్రామీణ ప్రాంతాల్లోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు కలెక్టరేట్ వద్ద సమ్మెలో భాగంగా ఏడవ రోజు ఆదివారం వర్షంలో వినూత్నంగా నిరసన తెలిపారు. సంఘం జిల్లా అధ్యక్షురాలు పి.మమత జ్యోతి, జిల్లా వర్కింగ్ అధ్యక్షుడు ఏ. సాయి శంకర్, జిల్లా కార్యదర్శి, కె.సాయితేజ ఆధ్వర్యంలో పలు మండలాల్లో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లుగా ఆందోళనలో భాగంగా కుటుంబ సభ్యులతో కలిసి నిరసన తెలిపారు. జిల్లా అధ్యక్షురాలు పి.మమత జ్యోతి మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ పనిచేస్తున్న తమకు రెండేళ్లుగా జీతాల విషయంలో సమస్యలు ఎదుర్కొంటున్నామని, నిబంధన ప్రకారం ఉద్యోగ భద్రత కల్పించాలని, ఎన్.హెచ్.ఎం ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతన సవరణ చేయాలని, పని ఆధారిత ప్రోత్సాహకాలను క్రమబద్ధీకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బి శివ, టి.మనోహర్, జల్లి, వెంకటేష్, జిల్లా ఉపాధ్యక్షుడు టీ, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు నిస్వార్థ సేవలే లక్ష్యం

యానాం: గత శాసనసభ ఎన్నికల్లో తనను గెలిపించి యానాం నియోజకవర్గ ప్రజలకు నిస్వార్థ సేవలు అందించాలన్నదే లక్ష్యమని, కోట్లాది రూపాయల నిధులతో పలు అభివృద్ధి, సంక్షేమ పనులు చేస్తున్నట్లు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పేర్కొన్నారు. ఆదివారం బెజవాడ గార్డెన్స్‌లో తన నూతన గృహ శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. యువకుడినైన తనను యానాం ప్రజలు ఆదరించారని, ఇప్పటి వరకు అద్దె గృహంలో జీవిస్తున్నానని అన్నారు. ప్రజలకు మరింత అందుబాటులో ఉండాలన్న ఉద్దేశ్యంతో శాశ్వత గృహనిర్మాణం చేపట్టినట్లు ఆయన తెలిపారు.

వైభవంగా వీరేశ్వరుని బ్రహ్మోత్సవాలు



వీరేశ్వరస్వామికి పంచామృతాభిషేకాలు

ఐ.పోలవరం: నిత్య కల్యాణ స్వామి మురమళ్ల భద్రకాళి సమేత వీరేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలు ఆలయంలో నాలుగు రోజులుగా వైభవంగా కొనసాగుతున్నాయి. నాల్గవ రోజు ఆదివారం అర్చకులు శైవాగమ పండితులు బ్రహ్మశ్రీ యనమండ్ర సత్య సీతారామ శర్మ ఆధ్వర్యంలో స్వామివార్లకు ఉదయం విశేష అభిషేకాలు, చండీహోమం, కళాహోమాలు, మధ్యాహ్నం రెండు గంటలకు స్వామివార్లను నంది వాహనంపై ఊరేగించారు. అనంతరం సదస్యము, సభా పూజ, పండిత సత్కారం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి మాచిరాజు లక్ష్మీ నారాయణ ఏర్పాట్లు పర్య వేక్షించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామివారు, అమ్మవార్ల మూల విరాట్‌ను పూలతో సర్వాంగసుందరంగా అలంకరించారు. పెద్ద ఎత్తున భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.